సాక్షి మహబూబాబాద్

సోమవారం | 17 | ఏప్రిల్ | 2023



అన్ని మతాలకు ప్రాధాన్యం
సర్వమత సామరస్యం పాటిస్తూ అన్ని మతాలకు ప్రభుత్వం పాధాన్యత కల్పిస్తోందని వరంగల్ నగర మేయర్ సుధారాణి అన్నారు. - 8లో▸



వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ
హైదరాబాద్‌లో జరిగిన ప్రథమ తెలంగాణ మాస్టర్ స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో డోర్నకల్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. - 8లో▸



వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



మిల్లర్ల నిర్లక్ష్యం!

- పాత బియ్యం ఇస్తేనే.. కొత్త ధాన్యం ఇచ్చేది
- సీఎంఆర్ జాప్యంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్
- 40శాతం యాసంగి బియ్యం పెట్టని మిల్లర్లు
- గత వానాకాలంలోనూ ఆలస్యమే



సాక్షి, మహబూబాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి దిగుమతి చేసుకున్న ధాన్యం మిల్లింగ్ చేసి సివిల్ సప్లయీస్, ఎఫ్‌సీఐకి పెట్టడంలో మిల్లర్లు ఆలస్యం చేస్తున్నారు. అయితే ఇప్పటికే మిల్లుల్లో ధాన్యం నిండుగా ఉన్నందున కొత్త ధాన్యం నిల్వ చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మిల్లర్లు పాత బియ్యం(గత ఏడాది యాసంగి) పెడితేనే.. ఈసారి ధాన్యం సరఫరా చేస్తామని రాష్ట్ర సివిల్ సప్లయీస్ అధికారులు తేల్చి చెప్పారు. దీంతో ఎక్కువ మొత్తంలో సీఎంఆర్ పెట్టాల్సిన మిల్లర్లలో ఆందోళన మొదలైంది.

40శాతం యాసంగి సీఎంఆర్ పెండింగ్..

గత ఏడాది యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు పంపించిన ధాన్యం మిల్లింగ్ చేసి బియ్యం పెట్టడంలో అత్యధిక శాతం మిల్లర్లు వెనకబడి ఉన్నారు. మొత్తం 11బాయిల్డ్, ఎనిమిది రా రైస్ మిల్లులకు 93,456 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపారు. ఇందుకు క్వింటాకు 67కిలోల చొప్పున మిల్లింగ్ చేసిన బియ్యం పెట్టాలి. ఇలా 63,495 మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంర్ చేసి ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయీస్ శాఖలకు సరఫరా చేయాలి. కానీ ఇప్పటి వరకు జిల్లాలో 59.95శాతం అంటే 37,728 మెట్రిక్ టన్నులు మాత్రమే పెట్టారు. ఇంకా 26,108 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెట్టాల్సి ఉంది. ఇందులో తొమ్మిది మిల్లులు సీఎంఆర్ పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉండగా.. మిగిలిన తొమ్మిది మిల్లులు మాత్రం మందకొడిగా సీఎంఆర్ పెడుతున్నాయి. ఇందులో నాలుగు మిల్లులు మాత్రం కనీసం 30శాతం సీఎంఆర్ కూడా పూర్తి చేయకపోవడం శోచనీయం. అదేవిధంగా వానాకాలంలో 58 మిల్లులకు 1,56,735 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపించారు. ఈ మిల్లుల నుంచి 1,05,012 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పెట్టాలి. వీటిలో ఇప్పటి వరకు 11,774 మెట్రిక్ టన్నుల(11.21శాతం) మాత్రమే సీఎంఆర్ పెట్టారు.

నెలాఖరు వరకు అవకాశం..

మిల్లింగ్ చేయడంలో జాప్యంపై రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించారు. మిల్లర్లపై ఒత్తిడి తీసుకొచ్చి సీఎంఆర్ త్వరగా పూర్తి చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. గత నెల చివరి వరకు అవకాశం ఇచ్చారు. అయినా పూర్తి చేయలేదు. దీంతో మరో అవకాశం అన్నట్లు ఈ నెల చివరి వరకు గత ఏడాది యాసంగి సీఎంఆర్ పెట్టాలని చెప్పారు. ఇదే విషయాన్ని జిల్లా అధికారులు మిల్లర్లకు చెప్పారు. దీంతో కొందరు మిల్లర్లు సీఎంఆర్ వేగవంతం చేశారు. కానీ మరికొందరు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జిల్లా అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే సీఎంఆర్ ఆలస్యం అవుతున్న మిల్లర్లలో కొందరు అప్పుడు దిగుమతి చేసుకున్న ధాన్యం బహిరంగ మార్కెట్‌లో అమ్మారని, పీడీఎస్ రైస్‌తో సీఎంఆర్ పెట్టవచ్చనే ధైర్యంతో ఇంతకాలం నెట్టుకొచ్చారు. వీరికి సివిల్ సప్లయీస్ శాఖలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న జిల్లా అధికారులు కూడా మద్దతు తెలిపారు. కానీ ఇప్పుడు తీరా సమయం ముంచుకురావడంతో మిల్లర్లతో పాటు వారికి మద్దతుగా ఉన్న అధికారులకు కూడా పాలుపోవడం లేదు.

ప్రారంభమైన కొనుగోళ్లు

యాసంగి ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరిగేందుకు ముందు నుంచే ప్రణాళిక రూపొందించారు. జిల్లాలో 64ఐకేపీ, 153 పీఏసీఎస్, 11జీసీసీ, మరో ఆరు రైతు మిత్ర సంఘాలు, ఇతర సంఘాల ద్వారా మొత్తంగా 234 సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సెంటర్ల ద్వారా 1.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో భాగంగానే గత గురువారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే ఈ నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలు తెరుస్తారు. ధాన్యం మిల్లర్లకు పంపించాలంటే సీఎంఆర్ పెండింగ్ ఉండవద్దనే నిబంధన పెట్టారు. ఈ పరిస్థితిలో సీఎంఆర్ పెట్టడంలో అలసత్వం వహించిన మిల్లర్లకు ధాన్యం పెట్టకుండా ఉంటారా.. వారికి మద్దతు తెలిపే అధికారుల పైరవీలతో ధాన్యం దిగుమతి చేసుకుంటారా అనేది జిల్లాలో చర్చగా మారింది.

సీఎంఆర్ పూర్తి చేసి దిగుమతి చేసుకోండి



యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెలాఖరు వరకు సీఎంఆర్ పూర్తి చేయాలని మిల్లర్లకు గడువు పెట్టాం. గడువులోపు సీఎంఆర్ పెట్టి కొత్త ధాన్యం దిగుమతి చేసుకోవాలి. లేని పక్షంలో ధాన్యం పెట్టవద్దనే ఆదేశాలు ఉన్నాయి. సకాలంలో సీఎంఆర్ పెట్టి సహకరించండి.

- నర్సింగరావు, డీఎస్‌ఓ, మహబూబాబాద్

కొబ్బరి బొండాలు కొడుతున్న వ్యాపారి



లస్సీ, జ్యూస్ పాయింట్ వద్ద ప్రజలు



కూల్ కూల్..



- అందుబాటులో పలు రకాల పండ్ల రసాలు
- ఎండ తాపాన్ని తట్టుకునేందుకు అధికంగా స్వీకరిస్తున్న ప్రజలు
- ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలకు భలే గిరాకీ

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. ఉదయం పది గంటల తర్వాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. కాగా అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి పలు రకాల పండ్ల రసాలు, పండ్లు స్వీకరిస్తున్నారు. అలాగే ఇళ్లల్లో ఉక్కపోతను తట్టుకునేందుకు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు, చల్లటి నీళ్ల కోసం ఫ్రిజ్‌ల కొనుగోళ్లు పెరిగాయి.

పెరిగిన గిరాకీ..

శీతల పానీయాలు, మిల్క్ డ్రింక్స్, ఐస్ క్రీమ్, వివిధ రకాల పండ్లు, పండ్ల రసాలకు గిరాకీ పెరిగింది. జిల్లాలోని మరిపెడ, తొర్రూరు, డోర్నకల్, కేసముద్రం, గూడూరు, బయ్యారం, కురవి, మానుకోట పట్టణంలోని ప్రధాన సెంటర్లలో లస్సీ, జ్యూస్ పాయింట్లు, పుచ్చకాయలు, చల్లని సోడా షాపులు, కొబ్బరి బొండాలు, చెరకు రసం పాయింట్లు వెలిశాయి. ఉదయం 10నుంచి రాత్రి 10గంటల వరకు గిరాకీ ఉంటుంది. కాగా మండుటెండల్లో వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారు చల్లదనం కోసం వీటికి స్వీకరించి ఉపశమనం పొందుతున్నారు.

ఎండ నుంచి ఉపశమనం



రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఎన్ని మంచినీళ్లు తాగినా సరిపోవడం లేదు. ప్రతీరోజు మధ్యాహ్నం చల్లని సోడా తీసుకుంటే ఎండ తీవ్రత నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.

-ప్రవీణ్ కుమార్, వ్యాపారి

కొబ్బరి బొండాలు తాగుతున్న..



మానుకోట ఎంఈఓ కార్యాలయంలో సీఆర్‌పీగా పని చేస్తున్న. ప్రతీరోజు జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్తా. వేసవికాలంలో శరీరంలో వేడి పెరగకుండా కొబ్బరి బొండాలు తీసుకుంటున్న. దీంతో కడుపులో చల్లగా ఉండి, వేడి తగ్గుతుంది.

-బాబాలాల్, బయ్యారం

కూలర్ కొనుగోలు చేశా..



నేను మండుటెండలో వ్యవసాయ పనులు చేస్తా. ప్రస్తుతం మధ్యాహ్న సమయంలో ఇంట్లో అధికంగా వేడి వస్తుంది. రూ.4,500 పెట్టి కూలర్ కొనుగోలు చేశా. కూలర్ కింద పిల్లలు హాయిగా నిద్రపోతున్నారు.

- లూనావత్ టీక్యా, జగ్గుతండా

పండ్లు, జ్యూస్‌లు తీసుకుంటున్నం..



ఎండలు అధికంగా ఉండడంతో పుచ్చకాయలు, వివిధ రకాల పండ్లు తీసుకోవడంతో కడుపులో కాస్త చల్లగా ఉంటుంది. మార్కెట్‌లో పుచ్చకాయలు కిలోల చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. లస్సీ, ఇతర పండ్ల జ్యూస్‌లు కూడా తీసుకుంటున్నం.

-చందు, మానుకోట

న్యూస్‌రీల్

కనుల పండువగా వేణు గోపాలస్వామి కల్యాణం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి వారి దేవాలయంలో ఆదివారం రాత్రి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణ చార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో స్వామి వారు, అమ్మవార్ల కల్యాణం జరిపి భక్తుల గోత్రనామాలపై అర్చన చేశారు. శ్రవణ నక్షత్ర పూజలు చేసి కల్యాణం జరిపినట్లు అర్చకులు తెలిపారు.

పేదలకు చేయూతనందించాలి




తొర్రూరు: పేదలకు చేయూతనందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మండలంలోని ముస్లింలకు ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సబీహాభాను సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన రూ.50 వేల విలువ చేసే దుస్తులు అందజేశారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని కంతాయపాలెం రోడ్డులోని వారి స్వగృహంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. సొంత లాభం కొంత మానుకుని పలువురు పరుల సేవకు పాటుపడడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సైదులు, మదార్, రజాక్, షరీఫ్, షేక్ అలీ, షబానా తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష ప్రశాంతం



మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని మోడల్ స్కూల్స్‌లో 6నుంచి 9వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈఓ పి.రామారావు ఆదివారం తెలిపారు. జిల్లాలో ఆరో తరగతి ప్రవేశపరీక్షకు 1,737 మంది విద్యార్థులకు గానూ 1,362 మంది హాజరయ్యారని, 7నుంచి 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 1,382 మంది విద్యార్థులకు 1,161 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రాంతీయ సమన్వయకర్త కె. ప్రత్యూష తెలిపారు.

కేయూ మూడేళ్ల లా సెమిస్టర్ల పరీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల లా కోర్సు మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) నిర్వహించేందుకు టైంటేబుల్ షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక విడుదల చేశారు. ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24, 27, మే 1, 4, 8 తేదీల్లో.. మూడవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 28, మే 2, 5, 9, మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29, మే 3, 6, 10 తేదీల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

అభివృద్ధికి తోడ్పాటునందించాలి



మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

డోర్నకల్: సొంత గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్ కోరారు. వివిధ రంగాల్లో రాణిస్తూ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో స్థిరపడిన డోర్నకల్‌వాసుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఖైరతాబాద్ వాసవిక్లబ్ ఆడిటోరియంలో డోర్నకల్ రెసిడెంట్స్ అసోసియేషన్ ఇన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో స్థిరపడిన డోర్నకల్‌వాసులను ఒకేచోట కలవడం ఆనందంగా ఉందన్నారు. ఎంచుకున్న రంగాల్లో రాణిస్తూ సొంత గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డోర్నకల్‌లో వ్యాయామశాలల అభివృద్ధికి రూ.25లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం నిర్వాహకులు మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు నాగుబండి మోహన్‌రావు, డబ్ల్యు సుధాకర్‌రావు, ఆనంద్‌కుమార్, కె.పరమేష్, కె.వీరస్వామి, పి.జైకర్, వై.బృందాధర్‌రావు, రాంకోటేష్, డాక్టర్ అచ్యుత్‌రావు, డాక్టర్ జితేందర్‌కుమార్‌జైన్, శమ్‌కుమార్, రావులపల్లి సత్యం, డాక్టర్ ప్రసాద్, అప్సర్, సురేష్‌కుమార్ పాట్ని, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాడి హక్కులు సాధించుకుందాం..



మరిపెడ సమావేశంలో మాట్లాడుతున్న నూకల నరేష్‌రెడ్డి

మరిపెడ: రాష్ట్రంలోని రెడ్డి సంక్షేమ సంఘాలన్నీ కలిసి పోరాడి హక్కులు సాధించుకుందామని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మరిపెడలోని ఆర్‌ఎస్‌ఆర్ ట్రస్ట్ రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల రెడ్డి సంఘం ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం గాదె అశోక్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని రెడ్డి సంఘాలు కలిసి సంఘటితమై ఒక వేదికను ఏర్పాటు చేసుకొని ఐక్యంగా పోరాడితేనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో రెడ్లు, ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించి నేటికీ ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రూ. 5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. ఈ నెల 18న హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో రెడ్డి సంఘాల ప్రతినిధులు సమావేశమై ఏక కార్యాచరణ రూపొందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డి ఐకేసీ నాయకులు గోపు జయపాల్‌రెడ్డి, ఎం.సత్యనారాయణరెడ్డి, రాంరెడ్డి, పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి, నాగమణి, నరేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, పుష్పలత, వెంకట్‌రెడ్డి, ఉప్పిరెడ్డి, స్థానిక రెడ్డి సంక్షేమ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరికొట్ల రవి, టీఎస్ సీపీఎస్ ఈయూ రాష్ట్ర కార్యదర్శి అవునూరి రవి డిమాండ్ చేశారు. టీఎస్ సీపీఎస్ ఈయూ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మానుకోట పట్టణంలోని జిల్లా ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి అవునూరి రవి, హరికోట్ల రవి మద్దతు తెలిపి మాట్లాడారు. కేంద్రంలోని పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం ఆగదన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రవిచంద్ర, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీకాంత్ నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ ఈయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పూసపాటి నాగముని, గోపు లక్ష్మీకాంత్, జిల్లా కోశాధికారి మల్లేశం, వివిధ సంఘాల నాయకులు వీరన్న, అశోక్, బద్రి నారాయణ, మల్లారెడ్డి, చుంచు శ్రీశైలం, వద్దెబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌కు అవార్డు

కరీమాబాద్: మామునూరు వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.హనుమంతరావుకు మెరిటోరియస్ టీచర్ అవార్డు లభించింది. ప్రతి ఏటా పి.వి. నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేస్తుండగా.. 2022 సంవత్సరానికి హనుమంతరావు ఎంపికయ్యారు. ఆదివారం వర్సిటీ వీసీ రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

రేషన్ డీలర్ల అవస్థలు

- మూడు నెలలుగా అందని కమీషన్ డబ్బులు
- షాపుల అద్దె చెల్లించలేని దుస్థితి
- జిల్లాలో 553 రేషన్‌షాపులు



కంకరబోడ్‌లోని రేషన్ షాపులో బియ్యం

మహబూబాబాద్: రేషన్ డీలర్లకు మూడు నెలలుగా కమీషన్ డబ్బులు అందడం లేదు. దీంతో షాపుల అద్దె కూడా చెల్లించలేని పరిస్థితి దాపురించిందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రేషన్ షాపుల ద్వారా తొమ్మిది రకాల సరుకులు సరఫరా చేయగా.. ప్రస్తుతం బియ్యం మాత్రమే అందిస్తున్నారు. దీంతో రేషన్ డీలర్ల ఆదాయం చాలా వరకు తగ్గింది. కాగా వచ్చే కొద్దిపాటి కమీషన్ కూడా ఇవ్వకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. ఇదిలా ఉండగా సివిల్ సప్లయీస్ గోదాం నుంచి తక్కువ తూకంతో బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇలా రేషన్ డీలర్లు రెండు రకాలుగా నష్టపోతున్నారు.

553 షాపులు..

జిల్లాలో మొత్తం 553 రేషన్‌షాపులు ఉన్నాయి. కాగా ఆహారభద్రత కార్డులు 2,25,000, అంత్యోదయ కార్డులు 15,463, అన్నపూర్ణ కార్డులు 2 ఉన్నాయి. కాగా ప్రతినెలా 45,27,901 కేజీల బియ్యం సరఫరా చేస్తున్నారు. కాగా క్షేత్రస్థాయిలో రేషన్ డీలర్లు బయోమెట్రిక్ లేదా ఐరిష్‌ద్వారా లబ్ధిదారులకు బియ్యం అందజేస్తున్నారు.

అందని కమీషన్..

రేషన్ డీలర్లకు క్వింటా బియ్యానికి రూ.70 కమీషన్ చెల్లిస్తున్నారు. ఈ కమీషన్‌తోనే షాపుల అద్దెతో పాటు హమాలీలు, ఇతర ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. కాగా మూడు నెలలుగా కమీషన్ అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం షాపుల అద్దె చెల్లించలేకపోతున్నామని వాపోతున్నారు. దానికి తోడు క్వింటాకు నాలుగు నుంచి ఐదు కేజీల బియ్యం తక్కువగా వస్తున్నాయని, తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. కాగా ఇప్పటికైనా కమీషన్ చెల్లించి ఆదుకోవాలని రేషన్ డీలర్లు కోరుతున్నారు.

ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం..

రేషన్ బియ్యం దందా, కమీషన్ డబ్బులు, తూకంలో తేడా ఇలా పలు సమస్యలపై త్వరలోనే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు.

కమీషన్ రావడం లేదు



మూడు నెలలుగా డీలర్లకు కమీషన్ రావడం లేదు. షాపుల అద్దెలు చెల్లించడం కష్టంగా ఉంది. బియ్యం దందాపై విచారణ చేపట్టాలి. డీలర్ల సమస్యలపై త్వరలోనే ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

-కుంభం యాదగిరి, రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

విద్యారణ్యపురి: టీచర్లు, కళాశాలల్లో పనిచేసే లెక్చరర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించడంతో పాటు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ లా కళాశాలలో టీచర్లు, అధ్యాపకులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై ఉన్న స్టే తొలగించడానికి ఎర్లీ హియరింగ్ పిటిషన్ వేసి ఈ వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పెండింగ్, జీపీఎఫ్ తదితర బిల్లులు చెల్లించడంతోపాటు వేతనాలు ఒకటో తేదీనే చెల్లించాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డీఈఓల పూల్‌లో ఉన్న 7,000 ఉపాధ్యాయ ఖాళీలను ఐఎఫ్ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో చూపాలన్నారు. వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులకు 30శాతం వేతనాలు పెంచడంతోపాటు రెగ్యులరైజ్ చేయాలన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, డిగ్రీ కళాశాలల్లో కేర్ టేకర్లను, పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దుచేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అంతకు ముందు పలువురు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల బాధ్యులు పలు సమస్యలను ముఖాముఖిలో నర్సిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలి

- ఎస్ఎఫ్ఓ నాగేశ్వర్‌రావు



అగ్ని ప్రమాదాలపై ప్రజలకు వివరిస్తున్న ఎస్ఎఫ్ఓ నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్: అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ నాగేశ్వర్ రావు అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ ఆస్పత్రి ఎదుట సిబ్బంది పలు విన్యాసాలు ప్రదర్శించి ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వేసవి కాలంలోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతాయని, ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని ప్రమాదాలపై ప్రజలను చైతన్యవంతులు చేయడం వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో లీడింగ్‌ఫైర్ ఆఫీసర్‌లు రవీందర్, కృష్ణ, సిబ్బంది సురేష్, వెంకయ్య, బావుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కవిత సుడిగాలి పర్యటన



చీకటి ప్రవీణ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ కవిత

నెల్లికుదురు: మండలంలోని పలు గ్రామాలల్లో ఎంపీ మాలోత్ కవిత ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐరన్, సిమెంట్ షాపును స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. చిన్నముప్పారం సర్పంచ్ చీకటి ప్రవీణ్ తండ్రి చీకటి జనార్దన్ మృతి చెందగా వారిని స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం మునిగలవీడు గ్రామంలో మృతుల కుటుంబాలను సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బీరవెల్లి యాదగిరిరెడ్డి, నల్లాని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, ఎంపీటీసీ సభ్యురాలు వాణి శ్రీనివాస్, ఆదిరెడ్డి, గుండ వెంకన్న, కదిర జగన్, ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అతిపెద్ద ప్లాస్టిక్ సర్జరీ

ఎంజీఎం : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తొడ పిరుదుల భాగంలో ఊడిపోయిన చర్మానికి ప్లాస్టిక్ సర్జరీలో భాగంగా నిర్వహించిన అతిపెద్ద శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తిచేశామని వరంగల్‌లోని గార్డియన్ హాస్పటల్ ఎండీ డాక్టర్ కాళీప్రసాద్ ఆదివారం వెల్లడించారు. ఫిబ్రవరి 23న కడిపికొండ బ్రిడ్జి వద్ద వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన కీర్తి సునీత(37) రోడ్డు ప్రమాదానికి గురైందని, సునీతపై నుంచి లారీ వెళ్లడంతో తొడ, పిరుదుల భాగం చర్మం ఊడిపోగా హుటాహుటిగా ఎంజీఎం ఆస్పత్రికి తరలించారని వివరించారు. నాలుగు రోజుల చికిత్స అనంతరం గార్డియన్‌లో చేరినట్లు తెలిపారు. ఈ మేరకు ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఉపేందర్, ఆర్థో వైద్యనిపుణులు కాళీప్రసాద్, డాక్టర్ శాంతన్‌కుమార్, డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేసి ప్రాణాపాయస్థితి నుంచి ఆమెను కాపాడినట్లు తెలిపారు. వరంగల్ జిల్లాలోనే తొలిసారిగా ఈ తరహా ఆపరేషన్ చేసినట్టు డాక్టర్ కాళీ ప్రసాద్ పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

డోర్నకల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచానికి ఆదర్శప్రాయుడని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.కాసిం తెలిపారు. డోర్నకల్ రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ నాయకులు బషీర్, గారె రమేష్, బాబు, దళిత సంఘ నాయకులు కామ సంజీవరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు తలారి విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఆత్మహత్య

హసన్‌పర్తి: ఆర్థిక ఇబ్బందులతో ఓ జూనియర్ లైన్‌మెన్ కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన భూక్యా రవి (47) గాయత్రినగర్‌లో ఉంటూ గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబపోషణ నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులు పెరిగిపోవడంతో ఆందోళనకు గురై ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. రవికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, భార్య ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

‘డ్రాగన్’ సాగులో సాఫ్ట్‌వేర్

- లక్షల జీతం వదిలి వ్యవసాయం
- డెయిరీ ఫామ్, కడక్‌నాథ్ కోళ్ల పెంపకం కూడా..
- ఆదర్శంగా నిలుస్తున్న భూక్యా తిరుపతి నాయక్

తరిగొప్పుల: మల్టీ నేషనల్ కంపెనీలో గౌరవప్రదమైన ఉద్యోగం.. నెలకు ఐదు లక్షల రూపాయల వేతనం.. అమెరికాలో విలాసవంతమైన జీవనం.. అన్నింటినీ వదులుకుని స్వగ్రామంలో రైతుగా మారాడు ఓ యువకుడు. తల్లిదండ్రులు చేస్తున్న వ్యవసాయంపై మమకారంతో ఆర్గానిక్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. సాగులో రైతులు ఎదుర్కొనే కష్టనష్టాలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఓ యువ సాఫ్ట్‌వేర్ సాగు బాటపట్టాడు. వ్యవసాయం మీద ఉన్న మక్కువతో స్వగ్రామంలో ఇది వరకు ఏ రైతు సాగు చేయని పంటను పండిస్తున్నాడు. అమెరికా, చైనా వంటి దేశాల్లో అధిక మొత్తంలో సాగయ్యే డ్రాగన్ ఫ్రూట్స్ పంటను మండలానికి కొత్తగా పరిచయం చేస్తున్నాడు. తొమ్మిది ఎకరాల్లో సాగు చేయాల్సిన డ్రాగన్ ఫ్రూట్‌ను ట్రెల్లిస్ పద్ధతిలో 18,000 వేల మొక్కలతో నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. డిమాండ్ ఉన్న పండ్లను ఎంచుకుని సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుందంటున్నాడు.

తరిగొప్పుల మండలంలోని జాలుబాయితండాకు చెందిన భూక్య దేవా, రుక్కమ్మ దంపతుల కుమారుడు భూక్య తిరుపతి హైదరాబాద్‌లోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ బీటెక్ పూర్తి చేసి, మాస్టర్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివేందుకు 2014లో అమెరికా వెళ్లాడు. 2016 మాస్టర్స్ పూర్తి చేశాడు. అనంతరం ఆపిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. నెలకు రూ.5 లక్షల జీతం. కానీ, ఉద్యోగంతో సంతృప్తి చెందక వ్యవసాయంపై ఉన్న మక్కువతో స్వగ్రామంలో ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకు తనకున్న వ్యవసాయ భూమిలో రూ.60 లక్షల ఖర్చు చేసి శ్రీ సాయిరాం డైరీ ఫామ్‌ను ఏర్పాటు చేశాడు. రెండు నెలల క్రితం 4 ఎకరాల్లో మొరాకెన్‌రెడ్, అమెరికన్ బ్యూటీ, లీసా, సీ వెరైటీ రకాల డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగు ప్రారంభించాడు. దీంతోపాటు స్వచ్ఛమైన పాల కోసం రూ.2.20 లక్షలతో గుజరాత్ నుంచి గిర్ జాతి ఆవులు తెప్పించాడు. అదేవిధంగా తమిళనాడు నుంచి 200 కడక్‌నాథ్ కోడి పిల్లలను తెప్పించి పెంచుతున్నాడు. మరో ఏడాది, రెండేళ్లలో డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి ప్రారంభం అవుతుందని చెబుతున్నాడు తిరుపతి నాయక్. లక్షల వేతనాన్ని వదిలి వ్యవసాయం వైపు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భూక్యా తిరుపతి నాయక్ తాను ఎంచుకున్న రంగంలో రాణించాలని ఆశిద్దాం.


ట్రెల్లిస్ పద్ధతిలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటలో తిరుపతి


గిర్ జాతి ఆవుతో..

వ్యవసాయం చేయాలనే తపన

పరాయి దేశంలో లక్షలు సంపాదించినా సంతృప్తి లేదు. ఆర్గానిక్ వ్యవసాయం చేయాలని అనుకున్నాను. అందుకే మల్టీనేషనల్ ఐటీ కంపెనీలో ఉద్యోగం వదిలేశాను. ప్రపంచ మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్‌కు డిమాండ్ అధికం. అందుకే ఆ పండ్లను సాగు చేయాలని నిర్ణయించుకున్నాను. దీంతోపాటు సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయాలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్నాను. త్వరలోనే ఫ్రెష్ ఫాం మార్కెట్ ఏర్పాటు చేసి తాజా కూరగాయలు విక్రయిస్తాను.

-భూక్యా తిరుపతి నాయక్

వెల్‌డన్ యశ్వంత్

- గవర్నర్‌ను కలిసిన మౌంటనర్ యశ్వంత్

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన మౌంటనర్ భూక్య యశ్వంత్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా గవర్నర్ యశ్వంత్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. పిన్న వయస్సులో ప్రాణాలను పణంగా పెట్టి ప్రపంచంలోని అతిశీతల పర్వతాలను అధిరోహించడం ఎంతో గొప్పవిషయమన్నారు. అంత ఎత్తులో ఉన్న పర్వత శిఖరాలపై జాతీయ జెండాను ఎగరవేసి భారత ఖ్యాతిని యావత్ ప్రపంచానికి చాటిన యశ్వంత్ ధైర్య సాహసాలను గవర్నర్ అభినందించాడు. ఈ నెల ఆస్ట్రేలియాలోని పర్వతారోహణకు వెళ్తున్నట్లు యశ్వంత్ గవర్నర్‌కు వివరించారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించే విధంగా కృషి చేయనున్నట్లు గవర్నర్ చెప్పినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రపంచంలోని పేరుగాంచిన మరెన్నో పర్వాతరోహణలు చేపట్టి దేశానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని గవర్నర్ సూచించినట్లు తెలిపాడు.


యశ్వంత్‌ను అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

అలుపెరుగని జీవితం రైతన్నది

- సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

ములుగు రూరల్: ప్రకృతితో పోరాడుతూ అలుపెరుగని జీవితం గడిపేది రైతన్న అని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సెలవు రోజు కావడంతో మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక ఉత్తమ్‌కుమార్ – అర్పితలకు చెందిన మిరపతోటలో కూలీ పనులకు వెళ్లారు. తోటి కూలీలతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి కలివిడిగా గడిపారు. రైతు ఇచ్చిన కూలీ డబ్బులు రూ.200లకు మరికొంత డబ్బు కలిపి నిరుపేద కూలీకి అందించారు. జిల్లా స్థాయి అధికారి కూలీలతో కలిసి వ్యవసాయ పనుల్లో పాల్గొనడంతో కూలీలు ఆశ్చర్యానికి గురయ్యారు.


మిర్చితోటలో కాయలు తెంపుతున్న సబ్ రిజిస్ట్రార్

దృష్టి మరల్చి దొంగతనం

- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

వరంగల్ క్రైం: దృష్టి మరల్చి దొంగతనానికి పాల్పడిన ములుగు జిల్లా బండారుపల్లికి చెందిన చించు, గుగులోతు స్వప్న, వెంకటాపూర్ మండలం నల్లకుంటకు చెందిన ఇటికల సురేందర్‌లను అరెస్టు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు. హన్మకొండ బాలసముద్రంలో రామాంచ కొంరమ్మ వృద్ధురాలిని మెడలో గొలుసు ఇవ్వలని, ఒక ఫోటో తీసుకోని ఇస్తామని నమ్మబలికి పరార్ అయినట్లు ఆయన తెలిపారు. నిందితులు హనుమకొండ బాలసముద్రంలో రామాంచ కొమురమ్మ అనే వృద్ధురాలి మెడలో గొలుసు ఇవ్వాలని, ఫొటో తీసుకుని ఇస్తామని నమ్మించి పరారయ్యారు. వారిని స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధి టైలర్ స్ట్రీట్‌లో పట్టుకుని రూ.50 వేల విలువైన 12 గ్రాముల బంగారు గొలుసు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మాయమాటాలు చెప్పే వారిని నమ్మి విలువైన వస్తువులు ఇవ్వొదని సూచించారు.

అన్ని మతాలకు ప్రాధాన్యం


- మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీ సారయ్య

ఖిలా వరంగల్: సర్వమత సామరస్యం పాటిస్తూ అన్ని మతాలకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందని నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర రోడ్లు, భవనాల సంస్థ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఈద్గా మసీదు ప్రాంగణం, ఖబ్రస్తాన్‌లో దర్గా కేర్‌టేకర్ ఎంఎ తస్వీర్ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వారు ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ముస్లిం మహిళల ఉపాధి కల్పనకు కుట్టుమిషన్లు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఖాజీపేట దర్గా పీఠాధిపతి కుస్రుపాషా, ఉర్సు దర్గా పీఠాధిపతి సయ్యద్ మోహినుద్దీన్ ఖాద్రి, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, మాజీ కార్పొరేటర్ ఎంబాడి రవీందర్, ఎంఎ తస్వీర్ తదితరులు పాల్గొన్నారు.


ఈద్గా మసీదులో సీసీ కెమెరాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్సీ తదితరులు

అమెరికాలో ‘వనం’ హఠాన్మరణం

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ శ్రీనగర్‌కాలనీకి చెందిన వనం సంపత్‌కుమార్‌రావు (66) భారత కాలమానం ప్రకారం అమెరికాలోని వర్జీనియాలో శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. సంపత్‌కుమార్ హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాల, భద్రాచలం, మహబూబాబాద్ డిగ్రీ కళాశాలల్లో లైబ్రేరియన్‌గా పని చేసి 2014లో రిటైర్ అయ్యారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. అమెరికాలో ఉండే కుమార్తె వద్దకు ఈ నెల 4వ తేదీన వెళ్లిన ఆయన గెండెపోటుతో మృతిచెందారు. కాగా, బుధవారం వరకు పార్థివదేహం ఇండియాకు వస్తుందని సంపత్ బావమరిది శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ కళాశాల టీచర్ల సంఘం అధ్యక్షుడు పులి సారంగపాణి, కార్యదర్శి మల్లారెడ్డి, సత్యనారాయణరావు, కృష్ణమూర్తి, ఎన్వీఎస్ చారి, సంఘం బాధ్యులు సంతాపం ప్రకటించారు.


సంపత్‌కుమార్‌రావు (ఫైల్)

వెయిట్ లిఫ్టింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ


విజేతలతో సుధాకర్(ఎడమ పక్క నిల్చున్న వ్యక్తి)

డోర్నకల్: హైదరాబాద్‌లో జరిగిన ప్రథమ తెలంగాణ మాస్టర్ స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో డోర్నకల్ భారత్‌వీర్ వ్యాయామశాల క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. చిక్కడపల్లి బీఎస్ఎన్ఎల్ కమ్యూనిటీ హాలులో మాస్టర్ స్టేట్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో భారత్‌వీర్ వ్యాయామశాలకు చెందిన క్రీడాకారుడు మండలోజు సుధాకర్ 55–60 సంవత్సరాల కేటగిరిలో 73 కేజీల విభాగం నుంచి పాల్గొని క్లీన్ 60 కేజీలు, స్నాచ్ 50 కేజీల బరువు కలిపి 110 కేజీల బరువు ఎత్తి రాష్ట్రస్థాయి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. 35–40 సంవత్సరాల కేటగిరిలో 73 కేజీల విభాగంలో క్లీన్ 60 కేజీలు, స్నాచ్ 50 కేజీలు కలిపి 110 కేజీల బరువు ఎత్తి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించాడు. సుధాకర్‌ను మంత్రి సత్యవతిరాథోడ్ సన్మానించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఆత్మకూరు: బావమరిది, అత్త దూషించారని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని అక్కంపేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అక్కంపేటకు చెందిన మాదాసి మధుకర్(30)కు పైడిపెల్లికి చెందిన మానసతో 4 ఏండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి తరచుగా గొడవ జరిగేది. ఈ క్రమంలో మధుకర్ బావమరిది రమేష్, అత్త వరలక్ష్మి మధుకర్‌ను దూషించారు. దీంతో మనస్తాపానికి గురై శనివారం అక్కంపేటలో కెనాల్ వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మధుకర్ తల్లి భాగ్య ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుడి నిర్లక్ష్యం వల్లే మృతి

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

హన్మకొండ చౌరస్తా: వైద్యుడి నిర్లక్ష్యం వల్లే మహిళ మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె బంధువులు ఆస్పత్రి ఎదుట ఆదివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండకు చెందిన రమ(30) కడుపులో సమస్యతో బాధపడుతుండగా.. ఈనెల 13న హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు రమను అడ్మిట్ చేసుకుని మరుసటి రోజు ఆపరేషన్ చేశారు. శనివారం సాయంత్రమే రమ మృతి చెందినప్పటికీ ఆరోగ్యశ్రీ నుంచి డబ్బులు ఆస్పత్రిలో జమయ్యాక ఆదివారం సాయంత్రం తెలియజేశారని మృతురాలి బంధువులు రోదిస్తూ చెప్పారు.

క్షుద్రపూజల కలకలం

వరంగల్ చౌరస్తా: వరంగల్ 26వ డివిజన్‌లోని గిర్మాజీపేట రామావారి వీధిలో క్షుద్రపూజలు కలకలం రేపుతున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. గత మూడు రోజులుగా రామావారి వీధిలో ఒక రోజు ఒక ఇంటి ఎదుట పసుపు, కుంకుమ, మరో రోజు మరో ఇంటి ఎదుట కోడిగుడ్లు, జీడిగింజలు, గవ్వలు, ఆదివారం చనిపోయిన కోడి, గుడ్లు, తదితర వస్తువులు ఇళ్ల ఎదుట కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై ఇంతేంజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. పోలీసు సిబ్బంది వివరాలు సేకరించి వదిలేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇస్తున్నారని పేర్కొంటున్నారు.


ఓ ఇంటిఎదుట పసుపు, కంకుమ

ఏసీపీ నేతృత్వంలో హత్యకేసు దర్యాప్తు

- పోలీసుల అదుపులో నిందితులు..!
- కొనసాగుతున్న విచారణ

ఖిలా వరంగల్: ‘తమ్ముడిని చంపిన అన్న’ హత్య ఘటన నగర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఆదివారం వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ నేతృత్వంలో శ్రీకాంత్ హత్య కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. తమ్ముడిని అన్న కర్రతో కొట్టి.. శరీరంపై పెట్రోల్ పోసి.. ఆపై బండరాయితో మోది హత్యచేసిన ఘటనను పోలీసులు చాలెంజ్‌గా తీసుకున్నారు. తన వాటాకు వచ్చిన ఇంటి స్థలాన్ని విక్రయించి నగరం నుంచి దూరంగా వెళ్తున్నానని చెప్పినందుకే శ్రీకాంత్‌పై అన్న గోవిందుల శ్రీధర్ కక్ష పెంచుకొని తమ్ముడిని హత్యచేశాడని విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. హత్యకు ఉపయోగించిన కర్ర, పెట్రోల్ డబ్బా, బండరాయిని స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాంత్ హత్యకేసులో అనుమానితులైన గోవిందుల శ్రీధర్, అతడి భార్య గోవిందుల అనిత, అతడి వదిన గోవిందుల రాజమ్మను శనివారం రాత్రే అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితులను పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఇసుక లారీ

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని కాల్వపల్లి నుంచి ఇసుక లోడుతో వెళ్తున్న లారీకి బ్రేకులు ఫెయిల్ అయి ఒడితల మూల మలుపు వద్ద 11కేవీ విద్యుత్ స్తంభానికి ఆదివారం ఢీ కొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయి విద్యుత్ వైర్లు కింద పడ్డాయి. అలాగే పాఠశాల ప్రహరీ కూలిపోయింది. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా బస్టాండ్ సమీపంలో ప్రజలు నిత్యం ఉండేవారని, ఎండకాలంగా కావడతో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింద గ్రామస్తులు పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ సందర్శించి అక్కడి నుంచి లారీని తొలగించారు. ఇదిలా ఉండగా.. గ్రామంలో విద్యుత్ సరాఫరా నిలిచిపోవడతో సర్పంచ్ ఎర్రబెల్లి సాంబలక్ష్మీ విద్యుత్ సిబ్బందిచే మరమ్మతులు చేయించారు.


విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ

మస్కట్‌లో అంబేడ్కర్ పుస్తకావిష్కరణ



నెక్కొండ/కాజీపేట అర్బన్: అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఉమాన్‌లోని మస్కట్‌లో ఎన్ఆర్ఐ వింగ్ వైస్ ప్రెసిడెంట్ షేక్ అహ్మద్, ఎన్ఆర్ఐ ఒమాన్ మహమ్మద్ ఇమామ్ ఆధ్వర్యంలో ఈనెల 14న శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెక్కొండ మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి పాస్ట్రేట్ చైర్మన్ కవి, రచయిత డాక్టర్ రెవ పెండ్యాల బాబురావు ఆదివారం వివరాలు వెల్లడించారు. తను రాసిన రచనలతో కూడిన పుస్తకాన్ని మస్కట్‌లో ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆయన వెంట జాన్ విక్టర్, రాజారత్నం, మోహన్, అనిల్, ఆంజనేయులు, రామ్‌దాస్, చంద్రిక ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారి జాన్‌పాక్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మిరుకుల మల్లయ్య(80) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని వంచనగిరికి చెందిన మల్లయ్య సాయంత్రం 6 గంటల సమయంలో వరంగల్ వైపు నుంచి తన గ్రామానికి సైకిల్‌పై వెళ్తుండగా నర్సంపేట వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.


మల్లయ్య(ఫైల్)

అక్కాతమ్ముళ్లను కలిపిన ‘బలగం’

లింగాలఘణపురం: మండల పరిధి వనపర్తిలో ఇటీవల ప్రదర్శించిన ‘బలగం’ సినిమా మనస్పర్థలతో దూరమైన అక్కా.. తమ్ముడి కుటుంబాలను కలిపింది. వివరాలిలా ఉన్నాయి. అనుముల లింగారెడ్డి, లక్ష్మి అక్కా తమ్ముళ్లు. లక్ష్మిని అదే గ్రామంలో పప్పు వీరారెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. రెండు కుటుంబాలు వనపర్తిలోనే ఉంటున్నాయి. 15 ఏళ్ల క్రితం లింగారెడ్డి కూతురు రజిని వివాహవేడుకల్లో లక్ష్మిని ఫొటో తీయకపోవడంతో భోజనం చేయకుండా అలిగి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆ రెండు కుటుంబాల మధ్య సంబంధాలు దూరమయ్యాయి. ఏడాదిన్నర క్రితం లక్ష్మి భర్త వీరారెడ్డి మృతి చెందగా.. అంత్యక్రియల సమయంలో లింగారెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నాడు. దీంతో అతడి భార్య వసంత, కొడుకు శ్రీకాంత్‌రెడ్డి అంత్యక్రియలకు వెళ్లొచ్చారు. అయినా రెండు కుటుంబాలు కలిసిపోలేదు. ఇటీవల సర్పంచ్ ఉంగరాల శ్రీధర్ గ్రామంలో బలగం సినిమాను పంచాయతీ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. ఆ సినిమా చూసిన లింగారెడ్డి, లక్ష్మి హృదయాల్లో మార్పు వచ్చింది. పంతాలు వదిలేసి సర్పంచ్ శ్రీధర్, గ్రామస్తులు మహేష్, రవీందర్‌రెడ్డి సమక్షంలో ఈనెల 15న లింగారెడ్డి తన అక్క లక్ష్మి ఇంటికి వెళ్లాడు. దీంతో గ్రామస్తులంతా సంతోషం వ్యక్తం చేశారు.


లింగారెడ్డి


పప్పు లక్ష్మి


అక్క లక్ష్మి ఇంట్లోకి వెళ్లి బోరున విలపిస్తున్న లింగారెడ్డి